సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 22 । జూలై । 2024



సత్యదేవుని నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి జల్లిపల్లి ముట్టేశ్వరరావు, జయలక్ష్మి దంపతులు (చింతలపూడి) రూ.1,01,116 విరాళాన్ని ఆదివారం సమర్పించారు.



ముత్యాలమ్మకు వెండి గరగ సమర్పణ

కె.గంగవరం: కోటిపల్లి గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం స్థానికులు వంకా సూర్యభాస్కర్ శర్మ కుటుంబ సభ్యులు రూ.2లక్షలతో వెండి గరగను సమర్పించారు.



ఆషాఢం ఎఫెక్ట్

జీడిపప్పు పరిశ్రమలు ఒడుదొడుకులను ఎదుర్కొంటున్నాయి. మొన్నటి వరకూ పప్పు ధర గరిష్ఠ స్థాయికి చేరడంతో వ్యాపారం గాడిలో పడిందనుకుంటున్న తరుణంలో ఆషాఢం ఎఫెక్ట్ ముంచేస్తోంది. – 8లో

న్యూస్‌రీల్

సఖినేటిపల్లి- నరసాపురం రేవు పాట రద్దు



సఖినేటిపల్లి రేవులో పంటు ప్రయాణం (ఫైల్)

సఖినేటిపల్లి: మాధవాయిపాలెం ఫెర్రీగా ప్రభుత్వ గుర్తింపు పొందిన సఖినేటిపల్లి – నరసాపురం రేవు పాటను పశ్చిమగోదావరి జిల్లా అధికారులు రద్దు చేశారు. ఆదివారం జరగాల్సిన రేవు పాట నిర్ణీత గడువుకు ఎవరూ ఒక్క షెడ్యూల్ కూడా కొనుగోలు చేయకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. రేవు పాటకు ఈ నెల 8న మూడోసారి టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. పాట ప్రారంభ ధర రూ.3.61 కోట్లుగా నిర్ణయించారు. నిర్ణీత గడువు శుక్రవారం నాటికి ఎవరూ ఒక్క షెడ్యూల్ కూడా కొనుగోలు చేయలేదు. కాగా ప్రారంభ ధర తగ్గించి తిరిగి పాట ఎప్పుడు నిర్వహిస్తారనేది ప్రకటిస్తారని ఇన్‌చార్జి ఎంపీడీఓ వీరభద్రరావు తెలిపారు.

కిటకిటలాడిన అయినవిల్లి



అయినవిల్లిలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఉదయం ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. మహానివేదన అనంతరం వివిధ పుష్పాలతో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 28 మంది, లక్ష్మీగణపతి హోమంలో 13 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. 28 మంది తమ నూతన వాహనాలకు పూజలు చేయించుకున్నారు. ఇద్దరు చిన్నారులకు తులాభారం, ముగ్గురు తలనీలాలు సమర్పించారు. 2,230 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయంలో వివిధ సేవలకు రూ.2,00,975 ఆదాయం లభించిందని కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు.

రత్నగిరిపై వ్యాసపూర్ణిమ

అన్నవరం: సత్యదేవుని సన్నిధిన వ్యాసపూర్ణిమ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. దర్బారు మంటపంలో వ్యాస మహర్షికి పండితులు ప్రత్యేక పూజలు చేశారు. తొలుత విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వ్యాసమహర్షి చిత్రపటంతో ఆలయ ప్రాంగణంలో మేళతాళాల నడుమ వేదపండితుల మంత్రోచ్చాటన మధ్య మూడుసార్లు ప్రదక్షిణ చేశారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి ప్రసాదాలు పంపిణీ చేశారు. సత్యదేవుని ఆలయానికి సుమారు 30 వేల మంది భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించి పూజలు చేశారు. స్వామివారి వ్రతాలు 1,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

వడివడిగా..



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద ఉధృతి

- ధవళేశ్వరం వద్ద పెరుగుతున్న గోదావరి
- సముద్రంలోకి 8.19 లక్షల క్యూసెక్కులు
- భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక
- నేడు మరింత పెరగనున్న వరద ఉధృతి
- నీట మునిగిన కనకాయలంక కాజ్‌వే

సాక్షి, అమలాపురం: వరద వడి పెరుగుతోంది.. గంట గంటకూ అధికమవుతోంది.. జిల్లాకు ముంపు ముప్పు పొంచి ఉంది. భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి పెరగడంతోపాటు దిగువన శబరి నదికి సైతం వరద తాకింది. దీంతో రెండు నదుల నుంచి వస్తున్న నీటితో అఖండ గోదావరి పరవళ్లు తొక్కుతోంది. ఇప్పటికే వరద నీరు కోనసీమ జిల్లాలోని లంక గ్రామాలను చుట్టేసింది. క్యాచ్‌మెంట్ ఏరియాలో భారీ వర్షాలు కురుస్తుండడంతో వరద క్రమేపీ పెరుగుతుండడంతో ఆ ప్రభావం జిల్లాలోని పది మండలాల్లో లంక గ్రామాలపై పడనుంది. ఇప్పటికే గోదావరి మధ్య ఉన్న పలు లంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

గోదావరి బేసిన్ పరిధిలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ధవళేశ్వరం బ్యారేజీ వద్దకు పెద్దఎత్తున నీరు వచ్చి చేరుతోంది. బ్యారేజీ నుంచి ఆదివారం రాత్రి 9 గంటల సమయానికి 8,18,853 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. నీటి మట్టం 10.50 అడుగులకు చేరింది. మరోవైపు భద్రాచలం వద్ద రాత్రి ఏడున్నర గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అలాగే శబరి నది నుంచి కూడా వరద నీరు పెద్దఎత్తున వస్తోంది. ఇక్కడ రాత్రి నుంచి వరద కొంత వరకూ తగ్గుముఖం పట్టింది. సోమవారం ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వరద మరింత పెరిగి రాత్రికి రెండో ప్రమాద హెచ్చరిక వరకూ వెళ్లవచ్చని చెబుతున్నారు. ధవళేశ్వరం, భద్రాచలం వద్ద వరద ప్రభావం దిగువన ఉన్న కోనసీమ లంక గ్రామాలపై సోమవారం ఉదయం నుంచి పడనుంది.

లంకల చుట్టూ చేరి..

జిల్లాలో గోదావరి మధ్య ఉన్న లంక గ్రామాల చుట్టూ ఇప్పటికే వరద నీరు చేరింది. పి.గన్నవరం మండలం జి.పెదపూడిలంక, ఊడిమూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక వాసులు రాకపోకలు సాగించే తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. సుమారు 2,800 మంది జనం నివసించే ఈ గ్రామాలకు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోకి వచ్చే పెదమల్లంక, అనగారిలంక, శ్రీరావారిలంకకు కోనసీమ జిల్లా నుంచే వెళ్తుంటారు. పి.గన్నవరం మండలం యర్రంశెట్టివారిపాలెం నుంచి ఈ గ్రామాలకు తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేసుకున్నారు. ఇదీ గోదావరి వరదకు కొట్టుకుపోవడంతో ఈ గ్రామాల ప్రజలు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పడవలపై వెళ్తున్నారు. తాజాగా ఇదే మండలం చాకలిపాలెం శివారు నుంచి పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం కనకాయలంకకు వెళ్లే కాజ్‌వే నీట మునిగింది. ప్రస్తుతం వరద నీటిలో రాకపోకలు సాగిస్తుండగా, వరద పెరిగితే రాకపోకలకు బోట్లు సిద్ధం చేశారు.

ఉధృతంగా ప్రవహిస్తూ..

ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ఉధృతి పెరుగుతుండడంతో అయినవిల్లి మండలం ముక్తేశ్వరం ఎదురుబిడియం కాజ్‌వే, మామిడికుదురు మండలం అప్పనపల్లి కాజ్‌వేల మీదకు వరద నీరు వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ముక్తేశ్వరం మండలం వృద్ధ గౌతమీ నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. పాత వంతెనతో సమానంగా వరద నీరు ఉంది. మరోవైపు లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలకు సైతం నీరు రానుంది.

రేవుల వద్ద పోలీస్ బందోబస్తు

జిల్లాలో గోదావరి వరద బారిన పడిన లంక గ్రామాల వద్ద లంక వాసులు పడవులు దాటే ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కోటిపల్లి- ముక్తేశ్వరం రేవులో ప్రయాణాలు నిలుపుదల చేయగా, తాజాగా సఖినేటిపల్లి- నరసాపురం, రాజోలు సమీపంలోని సోంపల్లి- అబ్బిరాజుపాలెం పంటు ప్రయాణాలను కూడా ఆపేశారు. వరదలకు ముంపు బారిన పడే గ్రామాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గుర్తించేందుకు ఆయా మండలాలకు చెందిన ఎంపీడీఓలు, తహసీల్దార్లు పర్యటించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు.

అప్రమత్తంగా ఉండండి: కలెక్టర్

గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో వరదలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. వరదలను ఎదుర్కొనే విషయంలో జిల్లా నుంచి గ్రామస్థాయి వరకూ అధికారులు అప్రమత్తం కావాలని ఆదేశించారు. అమలాపురం కలెక్టరేట్ నుంచి వరద ప్రభావత ప్రాంతాల డివిజన్, మండల, గ్రామస్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద సోమవారం మొదటి, రెండో ప్రమాద హెచ్చరికలు కూడా జారీ చేసే అవకాశం ఉందని తెలిపారు. అధికారులు అన్ని వేళలా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ముంపు గ్రామాల బాధితులను తరలించేందుకు పడవలు, బోట్లు, లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లను సిద్ధం చేయడంతో పాటు పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, కనీస వసతులు కల్పించాలని సూచించారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

నేడు స్కూళ్లకు సెలవు.. గ్రీవెన్స్ రద్దు

గోదావరి వరద ఉధృతి నేపథ్యంలో సోమవారం జిల్లాలోని అన్ని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గోదావరికి సోమవారం మొదటి, రెండో ప్రమాద హెచ్చరికలు జారీ చేసే అవకాశమున్నందున ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. అలాగే కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్ రద్దు చేసినట్లు ప్రకటించారు.



కనకాయలంక కాజ్‌వేపై చేరిన వరదనీటిలో నడిచి వస్తున్న బాలికలు



పెదపట్నం మధ్య లంక నుంచి పశుగ్రాసాన్ని పడవలో తీసుకొస్తున్న రైతులు

ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్

- నేటి నుంచి 28 వరకూ ప్రత్యేక వారోత్సవాలు
- మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్ర సమగ్ర శిక్షా

రాయవరం: కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం (ఎస్ఈపీ)–2020 ప్రవేశపెట్టి నాలుగు వసంతాలు పూర్తయింది. దీంతో ఈ నెల 22వ తేదీ సోమవారం నుంచి 28వ తేదీ వరకూ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ (విద్యా వారం) కార్యక్రమం నిర్వహణకు జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్షా సంయుక్తంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాయి. డాక్టర్ కృష్ణస్వామి కస్తూరి రంగన్ సిఫార్సుల మేరకు అప్పటి వరకూ ఉన్న 10+2+3 విద్యా విధానం బదులుగా నూతన జాతీయ విద్యా విధానం–2020 రూపకల్పన జరిగింది. ఇందులో 5+3+3+4 పాఠశాల విధానాన్ని ప్రవేశపెట్టారు. దీనిని 2020 జూలై 29న కేంద్రం ఆమోదించింది. నూతన విద్యా విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లే లక్ష్యంతో శిక్షా సప్తాహ్ నిర్వహిస్తున్నారు. ఇందేలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, సమాజ భాగస్వామ్యం కావాలని విద్యా శాఖ విడుదల చేసిన మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.



కార్యక్రమాల అమలు ఇలా..

- శిక్షా సప్తాహ్‌లో భాగంగా విద్యాభివృద్ధికి వివిధ అంశాలతో వారం రోజుల ప్రణాళికను జిల్లా విద్యాశాఖ సిద్ధం చేసింది.
- సోమవారం ఉపాధ్యాయులు స్థానికంగా లభించే వనరులతో బోధనా అభ్యసన సామగ్రి తయారు చేసి ప్రదర్శించాలి. దీనికి విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు స్థానిక పెద్దలను ఆహ్వానించాలి.
- 23న పునాది అభ్యసన కార్యక్రమం నిర్వహించాలి. ఇందులో భాగంగా 1వ తరగతి నుంచి భాషపై పట్టు సాధించేందుకు పునాది అభ్యసనం, గణితంలోని సంఖ్యా శాస్త్రం కార్యక్రమం అమలు చెయ్యడానికి సమాజ భాగస్వామ్యులకు చర్చ ద్వారా అవగాహన కల్పించాలి.
- 24న వివిధ క్రీడాంశాలపై పోటీలు నిర్వహించాలి. శారీరక సౌష్టవం ప్రాముఖ్యతను తెలియజేసేలా ఈ పోటీలు ఉండాలి.
- 25న విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించడానికి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలి. ఫ్యాన్సీ డ్రెస్, పాటలు, నృత్య ప్రదర్శన, నాటికలు ప్రదర్శించాలి.
- 26న సాంకేతిక నైపుణ్యాలపై వివరించాలి. తరగతి గది అనుభవాలను మెరుగుపరచడానికి డిజిటల్ కార్యక్రమాలకు అవసరమయ్యే నూతన నైపుణ్యాల అవసరాన్ని గుర్తించడం, విద్యలో సాంకేతిక అభివృద్ధిపై చర్చించడం.
- 27న పర్యావరణ పరిరక్షణకు పాఠశాలలో న్యూట్రిషన్ డే నిర్వహణ, కొత్త ఎకో క్లబ్ ఏర్పాటు, విద్యార్థులు, తల్లులు, మాతృభూమి మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి అమ్మ పేరుతో అమ్మతో కలసి మొక్కలు నాటడం.
- 28న సామాజిక భాగస్వామ్యంలో భాగంగా ప్రజలు, తల్లిదండ్రుల కమిటీలు, ఉపాధ్యాయ సంఘాల సహకారాన్ని పెంపొందించాలి. పుట్టిన రోజులు, ప్రత్యేక సందర్భాల్లో విద్యార్థులతో పెద్దలు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనం చేయడం వాటిపై అవగాహన కల్పించాలి.

సమ సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలి

అమలాపురం టౌన్: విద్యార్థులు సమ సమాజ స్థాపనలో భాగస్వాములై మూఢ నమ్మకాలను పారదోలాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రామ్మోహన్ అన్నారు. స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన విద్యార్థుల సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం విద్యను కాషాయీకరణ చేస్తూ విద్యార్థుల్లో మూఢ నమ్మకాల భావజాలాన్ని, మతోన్మాద వాదాన్ని నింపేందుకు ప్రయత్నిస్తోందన్నారు. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో అసౌకర్యాలు, సమస్యలపై ఎస్ఎఫ్ఐ సర్వే చేసిందన్నారు. ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. వసతి గృహాల సమస్యలను సకాలంలో పరిష్కరించకుంటే రాష్ట్ర ప్రభుత్వంపై ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కె.శంకర్ మాట్లాడారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్

చింతా శ్యామ్‌కుమార్ జాదూగార్ తన ఇంద్రజాల ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అనంతరం జిల్లా ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా ప్రేమ్‌కుమార్, కో కన్వీనర్‌గా శశితోపాటు మరో 20 మంది సభ్యులను ఎన్నుకున్నారు. సదస్సులో సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, ఐద్వా నాయకురాలు టి.నాగ వరలక్ష్మి, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వృత్తిపై నిబద్ధత ఉండాలి

తెలంగాణ హైకోర్టు జడ్జి సాంబశివరావు నాయుడు

రామచంద్రపురం: కొత్తగా వచ్చే న్యాయవాదులకు వృత్తి పట్ల నిబద్ధత ఉండాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ సాంబశివరావు నాయుడు తెలిపారు. రామచంద్రపురం బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా చేస్తూ అంచెలంచెలుగా ఎదుగుతూ తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నత పదవిని చేపట్టిన జస్టిస్ సాంబశివరావు నాయుడు దంపతులను స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టుల ప్రాంగణంలోనూ, దినవహి బుచ్చిరాజు కల్యాణ వేదికలోనూ ఆదివారం ఘనంగా సత్కరించారు. కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు, పట్టణ ప్రముఖులు, స్నేహితులు, బంధువులు పెద్ద ఎత్తున వచ్చి జ్ఞాపికలతో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదిగా వృత్తి ప్రారంభించి నేడు జడ్జి స్థాయికి వెళ్లిన తనను అసోసియేషన్ వారు అభినందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. విశిష్ట అతిథి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవి చీమలపాటి మాట్లాడుతూ న్యాయ శాస్త్రాల్లో మారుతున్న మెళకువలను న్యాయవాదులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ దేశంలో న్యాయవ్యవస్థ విశిష్టమైందని కొనియాడారు. జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన ఒక న్యాయవాది రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానానికి న్యాయమూర్తిగా ఎదగడం హర్షణీయమన్నారు. ఈ సమావేశానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీ మోహన్ వెంకట రమణ అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ వాడ్రేవు అతిథులను ఆహ్వానించారు. సీనియర్ న్యాయవాదులు ఎన్.నాగబాబు, ఉండవల్లి గోపాలరావులు జస్టిస్ సాంబశివరావును న్యాయవాదులకు పరిచయం చేశారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది కె.సార్వభౌమరావు, విశ్రాంత జిల్లా జడ్జి డీఎల్ కామేశ్వరిలు జస్టిస్ సాంబశివరావును అభినందించారు. అడిషనల్ జిల్లా జడ్జి ఎం.మాధురి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జిలు నిజాం శారద, వి.నాగేశ్వరరావు నాయక్, ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి, బార్ కార్యవర్గ సభ్యులు డీఎస్ఎస్ శర్మ, పలివెల సత్యనారాయణ, వీరరెడ్డి, చక్రవర్తి, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.



జడ్జి సాంబశివరావు నాయుడు దంపతులను సత్కరిస్తున్న మురళీ తదితరులు

సీఎస్ఈ వైపే అందరి చూపు

- ఇంజినీరింగ్‌లో ఈ విభాగానివే 4,600 సీట్లు
- ఉమ్మడి జిల్లాల్లో వంద శాతం భర్తీ
- నేటితో ప్రథమ దశ షెడ్యూల్ పూర్తి
- సంప్రదాయ కోర్సులకు తగ్గిన ఆదరణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్‌లో సీఎస్ఈకి ఎనలేని ప్రాధాన్యం పెరిగింది. ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉండే ఈ విభాగం వైపే అంతా ఆసక్తి చూపుతున్నారు. దీనికి సంబంధించి ప్రథమ దశ ప్రవేశాలకు కన్వీనర్ కోటా సీట్లు సాధించిన విద్యార్థుల చేరికలకు సోమవారం తుది గడువు ఇచ్చారు. ఇంజినీరింగ్‌లో సుమారు 40 వరకూ వివిధ కోర్సులు ఉండగా, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ)కే మొగ్గు చూపుతున్నారు. సీఎస్ఈ విద్యార్థులకు మూడో ఏడాదిలోనే భారీ వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు వస్తున్నాయి. ప్రస్తుత కంపెనీ అవసరాలకు అనుగుణంగా జాబ్ మార్కెట్ ట్రెండ్‌కు అనువుగా కంప్యూటర్ సైన్స్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ)బ్లాక్ చైన్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, మెషీన్ లెర్నింగ్, డైటా సైన్స్ వంటి కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. వీటికి దేశ, విదేశాల్లో అపార ఉద్యోగ అవకాశాలు ఉండడంతో విద్యార్థులు ఈ కోర్సులకు మొగ్గు చూపుతున్నారు. కన్వీనర్ కోటాలో సీటు రాకపోయినా ప్రతి కళాశాలకు బ్రాంచ్‌కు 12 సీట్లు చొప్పున మేనేజ్‌మెంట్ కోటా ఉండటంతో ఈ కోటాలో చేరడానికి ఏమాత్రం వెనకడుగు వెయ్యడం లేదు. కాకినాడ జిల్లా పరిధిలో పేరొందిన ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల డొనేషన్ సీఎస్ఈ బ్రాంచ్‌కు చెబుతున్నారంటే, ఏ స్థాయిలో డిమాండ్ ఉందో అర్థమవుతోంది. ఉమ్మడి జిల్లాలోని కళాశాలల్లో అన్ని విభాగాలు కలిపి 12,500 సీట్లు ఉండగా, ఇందులో 4,600 వరకూ సీఎస్ఈ విభాగానికి చెందినవే. వీటికి మొదటి దశ సీట్ల భర్తీ పూర్తయ్యింది. ఉన్న 8 బ్రాంచ్‌ల్లో సీట్లు తగ్గించి సీఎస్ఈ సంబంధిత కోర్సులకు అధిక సీట్లు కేటాయించాలని జేఎన్‌టీయూ కాకినాడకు ఈ ఏడాది పాత ఉమ్మడి జిల్లాలో 8 కళాశాలలు దరఖాస్తు చేసుకున్నాయి. విద్యార్థులు అంతగా ఆసక్తి చూపని మెకానికల్, సివిల్, కెమికల్, ఆటో మొబైల్, ఈఈఈ, మైనింగ్ వంటి విభాగాల్లో కోర్సులు తగ్గించుకుంటున్నాయి.



గూగుల్ సంస్థలో రూ.67 లక్షలతో ఉద్యోగం సాధించిన జేఎన్‌టీయూ సీఎస్ఈ విద్యార్థిని అభినందిస్తున్న గత వీసీ ప్రసాదరాజు, టీపీఓ కరుణ (ఫైల్)

ప్రారంభ ప్యాకేజీ రూ.4 లక్షలు

సీఎస్ఈ విభాగంలో బీటెక్ పూర్తి చేసిన వారికి ప్రారంభ ప్యాకేజీ రూ.4 లక్షలు ఉంటోంది. దీంతో ఈ కోర్సులో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. టీసీఎస్, విప్రో, హెచ్‌సీఎల్, మైక్రోసాఫ్ట్, టెక్ మహీంద్ర, ఐబీఎం వంటి కంపెనీలు క్యూ కట్టడంతో మరింత డిమాండ్ పెరిగింది. ఇటీవల జేఎన్‌టీయూకేలో గత ఏడాది సీఎస్ఈ పూర్తి చేసిన ఇద్దరు విద్యార్థులకు రూ.36 లక్షలు, ఈ ఏడాది జూన్‌లో సీఎస్ఈ ఎంటెక్ విద్యార్థికి గూగుల్ సంస్థలో సెక్యూరిటీ ఎనలిస్ట్‌గా రూ.67 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం రావడంతో కళాశాల చరిత్రలో మైలు రాయిగా నిలిచింది. జేఎన్‌టీయూ కాకినాడతో పాటు అనుబంధ కళాశాలల్లో సీఎస్ఈ బ్రాంచ్ విద్యార్థులు 95 శాతం నాలుగో ఏడాదిలో ఉండగానే ఉద్యోగాలు రావడం వంటివి మరింత ఉత్సాహం నింపుతున్నాయి.

ట్రెండ్ మారింది..



ఇంజినీరింగ్ అంటే సాఫ్ట్‌వేర్ అనే విధంగా ప్రస్తుతం ట్రెండ్ మారింది. బీటెక్‌లో సంప్రదాయ కోర్సులున్నా నేటి కాలంలో సాంకేతికతకు అనుగుణంగా కొత్త కోర్సుల వైపు విద్యార్థులు మొగ్గ చూపుతున్నారు. ముఖ్యంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్ వంటి వాటిపై ఆసక్తి చూపుతున్నారు. ఎమర్జింగ్ టెక్నాలజీ, కోడింగ్ ప్లాట్‌ఫామ్స్, సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహన ఉంటే ఉద్యోగాలు త్వరగా పొందవచ్చు.

– కరుణ అరవ, సీఎస్ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్, జేఎన్‌టీయూకే

క్లుప్తంగా

నేటి నుంచి రెండో బ్యాచ్‌కు శిక్షణ

సామర్లకోట: స్థానిక ఈటీసీలో సోమవారం నుంచి 11 జిల్లాల్లోని అధికారులకు రెండో బ్యాచ్ శిక్షణ ఉంటుందని ఆ కేంద్రం మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని అన్ని శాఖల అధికారులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇస్తామన్నారు. మొదటి బ్యాచ్‌లో పేదరికం లేని గ్రామంపై మూడు రోజుల శిక్షణ ఇచ్చామన్నారు. రెండో బ్యాచ్ సోమవారం నుంచి బుధవారం వరకూ ×బాలల స్నేహ పూర్వక వికాస గ్రామం॰ అనే అంశంపై శిక్షణ ఉంటుందన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో 9 అంశాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని, మూడు అంశాలపై మూడు బ్యాచ్‌ల్లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. మిగిలిన ఆరు అంశాలపై బాపట్ల, శ్రీకాళహస్తి ఈటీసీల్లో తరగతులు ఉంటాయన్నారు.

వాటర్ ట్యాంక్‌లో మునిగి హెల్పర్ మృతి


రక్షణ ఆనంద్ (ఫైల్)

కాకినాడ రూరల్: కాకినాడ బొందగుంట వద్ద వాటర్ ప్లాంట్‌లో హెల్పర్‌గా పనిచేస్తున్న అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం గ్రామానికి చెందిన సలాది రక్షణ ఆనంద్ (40) ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తూ వాటర్ ట్యాంక్‌లో మునిగి మృతి చెందాడు. సర్పవరం పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ అర్బన్ సూర్యారావుపేటలోని అపోలో ఆస్పత్రి వెనుక రక్షణ ఆనంద్ కుటుంబంతో కలసి నివాసం ఉంటున్నాడు. అతనికి భార్య మాణిక్యంబ, ఇద్దరు కుమారులు ఉన్నారు. సుమారు 13 ఏళ్లుగా వాటర్ ప్లాంట్‌లో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం 8 గంటల సమయంలో వాటర్ టెస్టింగ్ నిమిత్తం ట్యాంక్‌లోకి దిగాడు. లోతు ఎక్కువగా ఉండడంతో ప్రమాదశాత్తూ మునిగిపోయి మృతి చెందాడు. వాటర్ ప్లాంట్ సిబ్బంది సమాచారంతో ప్రమాద స్థలం వద్దకు చేరుకున్న మృతుడి తండ్రి సలాది రాజేశ్వరరావు తల్లడిల్లిపోయారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఎంతున్నావే మునగకాడ..


నాలుగు అడుగుల మునగకాడ

సఖినేటిపల్లి: ఒకటి కాదు.. రెండు కాదు.. సుమారు నాలుగడుగుల మునగకాడ అబ్బురపరుస్తోంది. ఇది అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అంతర్వేదిపాలెంలో రైతు చెల్లుబోయిన సత్యనారాయణ ఇంటి పెరట్లో హైబ్రిడ్ రకానికి చెందిన మునగ మొక్కను నాటారు. దీనికి నాలుగు అడుగుల ఎత్తు గల మునగకాడ కాయడంతో స్థానికులు వింతగా చూస్తున్నారు. సాధారణ మునగకాడ చెట్టులా గుత్తుగా కాయడం లేదని, పరిమితంగా కాస్తోందని సత్యనారాయణ తెలిపారు.

మద్యం మత్తులో మారణ హోమం

- కాకినాడలో కారు విధ్వంసం
- శనివారం రాత్రి జరిగిన ఘటనలో ఇద్దరి మృతి, ఒకరి పరిస్థితి విషమం
- మృతదేహాలు తునాతునకలు


పీత దుర్గాసతీష్ (ఫైల్)


చాట్ల నాగ లక్ష్మణ్ కుమార్ (ఫైల్)


తెగిన దుర్గాప్రసాద్ కాలిని తండ్రి అన్నవరానికి అందిస్తున్న పోర్టు సీఐ సుమంత్


కాలు కోల్పోయి చికిత్స పొందుతున్న దుర్గాప్రసాద్

కాకినాడ క్రైం: శనివారం రాత్రి కాకినాడ ఒక్కసారిగా ఉలిక్కి పడింది. నగర నడిబొడ్డులో ఎన్నడూ లేని రీతిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మద్యం మత్తు రెండు నిండు ప్రాణాలను మింగేసింది. అతి వేగంగా కారు నడిపి అమాయక యువకుల జీవితాలను ఓ వ్యక్తి హరించాడు. ప్రమాదం ధాటికి వారి దేహాలు తునాతునకలు అయ్యాయంటే ఎంత వేగంతో కారు ఢీకొట్టిందో అంచనా వేయొచ్చు. మరో యువకుడు తన కుడి కాలిని పూర్తిగా కోల్పోయాడు. ఇంతటి ఘోరానికి కారకుడైన వ్యక్తి మృత్యువుతో పోరాడుతున్నాడు.

మద్యం మత్తులోనే..

కాకినాడ కల్పనా సెంటర్‌లో శనివారం రాత్రి జరిగిన ప్రమాదానికి మద్యం మత్తే కారణమైందని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. స్థానిక రామకృష్ణారావు పేటకు చెందిన చల్లా రామ్మోహన్ తన కారులో మరో యువతితో కలసి తన ఇంటి నుంచి బయల్దేరాడు. మద్యం మత్తులో కారును అతివేగంగా నడుపుతూ కల్పన కూడలికి చేరుకున్నాడు. ఈ కూడలిలో ఓ బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. తర్వాత అక్కడి విగ్రహం సిమెంట్ దిమ్మను ఢీకొనడంతో కారు బోల్తా పడింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న కాకినాడ పేర్రాజుపేటకు చెందిన పీత దుర్గాసతీష్ (31), నీలవారి వీధికి చెందిన చాట్ల నాగలక్ష్మణ్ కుమార్ (34) ప్రాణాలు కోల్పోయారు. అక్కడ నిలుచుని ఉన్న రేచర్లపేటకు చెందిన జక్కం దుర్గాప్రసాద్ (32) తన కుడి కాలు పూర్తిగా ఊడిపడింది. కారులో యువతికి స్వల్ప గాయాలు కాగా, రామ్మోహన్ తీవ్ర గాయాలపాలై కోమాలోకి వెళ్లాడు. లక్ష్మణ్‌కుమార్ చేయి తెగి దేహానికి అల్లంత దూరాన పడింది. ఈ ఘోర రోడ్డు ప్రమాదంతో కల్పన కూడలి రక్తసిక్తమైంది. ఇదిలా ఉండే అక్కడే పార్క్ చేసిన ఓ యాక్టివా వాహనం కూడా ధ్వంసమైంది.

తెగిన కొడుకు కాలిని కౌగిలించుకుంటూ..

దుర్గాప్రసాద్ కుడి కాలు పూర్తిగా దేహం నుంచి వేరుపడగా క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అతని తండ్రి అన్నవరం ఘటనా స్థలానికి వచ్చి తన కుమారుడి కాలిని ఏడుస్తూ వెతికిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. కాకినాడ పోర్టు సీఐ సుమంత్, దుర్గాప్రసాద్ కాలి వెతికి ప్లాస్టిక్ కవర్ చుట్టి అన్నవరానికి అందించారు. ఆ కాలిని గట్టిగా కౌగిలించుకుంటూ అన్నవరం గుండెలవిసేలా రోదించాడు. తర్వాత కన్న బిడ్డ కోసం చిన్నపిల్లాడిలా అంబులెన్స్ వెనుక పరుగులు తీయడం చూపరులను కలచివేసింది. ఆయన ఆవేదన చూసిన అక్కడి వారు ద్విచక్ర వాహనంపైకి ఎక్కించుకుని అంబులెన్సు వెనుక తీసుకువెళ్లి ఆసుపత్రి వద్ద దింపారు.


మారణ హోమాన్ని సృష్టించి బోల్తా పడిన కారు

బిడ్డ ఉన్నతి కోసం..

పీత దుర్గాసతీష్‌కు దేవితో ఏడేళ్ల కిందట వివాహమైంది. పేర్రాజుపేటలో భార్య పేరుతోనే దేవి టిఫిన్స్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ దంపతులకు సుమారు ఐదేళ్ల ఎదురుచూపుల తర్వాత గతేడాది ఫిబ్రవరిలో ఓ బాబు జన్మించాడు. బిడ్డ భవిష్యత్ తనలా కాకూడదని వాడి జీవితం ఉన్నతంగా ఉండాలని, అందుకు ఏదైనా చేస్తానని, ఎంత కష్టమైనా పడతానంటూ ముందు రోజే సతీష్ తన భార్యతో అన్నాడు. ఈ విషయాన్ని తలచుకొని ఆ కుటుంబం కన్నీరు మున్నీరు అయ్యింది.

ఉద్యోగ ప్రయత్నాల్లో ఉండగా..

జీజీహెచ్ వెనుక నీలవారి వీధికి చెందిన చాట్ల నాగ లక్ష్మణ్‌కుమార్ హైదరాబాద్ వెళ్లి సీరియల్స్ షూటింగ్‌లో హెల్పర్‌గా పనిచేసేవాడు. కొన్నేళ్ల కిందట తండ్రిని కోల్పోయిన అతడు తల్లి, సోదరుడిని వదిలి ఉండలేక తిరిగి కాకినాడకు వచ్చి మిమ్మల్ని వదిలి ఉండలేకపోతున్నానని కన్నీటి పర్యంతమయ్యాడు. దీంతో చలించిపోయిన కుటుంబ సభ్యులు వెళ్లొద్దంటూ చెప్పేసరికి స్థానికంగానే ఉద్యోగం చూసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఘోర ప్రమాదం అతని ప్రాణాలు మిండేసింది.

పాత నేరస్తుడు... ఎంబీఏ గ్రాడ్యుయేట్

ప్రమాదానికి కారణమైన చల్లా రామ్మోహన్ ఎంబీఏ గ్రాడ్యుయేట్. ఇతడిపై పలు కేసులు ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. విశాఖపట్నంలో నివసిస్తున్న ఇతడిపై పలు దొంగతనాల కేసులు ఉన్నాయి. మద్యానికి బానిసైన అతడు రామకృష్ణారావు పేటలో తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. రూ.30 లక్షలు వెచ్చించి కొద్ది రోజుల కిందట ఓ కారు కొన్నాడు. శనివారం రామకృష్ణారావుపేటలో ఏదో విషయంపై గొడవపడి కాకినాడ వెంకట్‌నగర్‌కు చెందిన పద్మ అనే యువతిని ఆ కారు ఎక్కించుకొనే బయల్దేరాడు. మద్యం తాగుతూ కారు నడపడంతో ప్రమాదం జరిగింది. కారు బోల్తా పడిన తర్వాత కారు నుంచి మద్యం సీసా, తినుబండారాలు బయట పడ్డాయని పోలీసులు వెల్లడించారు. అతడితో పాటు ఉన్న యువతి ఎవరు, రామ్మోహన్‌కు ఏమవుతుందన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తలకు తీవ్ర గాయమైన రామ్మోహన్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతుండగా, ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఆదివారం మృతదేహాలకు జీజీహెచ్‌లో పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందించారు. ఈ ప్రమాద ఘటనపై కాకినాడ డీఎస్పీ హనుమంతరావు ఆధ్వర్యంలో త్రీ టౌన్ సీఐ భగవాన్ బృందం దర్యాప్తు చేస్తోంది.

అనుమానమే పెనుభూతమై..


విషణ్ణ వదనాలతో బంధువులు, మృతురాలి కుమార్తెలు

- కత్తెరతో భార్యను హతమార్చిన భర్త
- శెట్టిపేటలో సంఘటన


మృతి చెందిన కురసాల నవ్య

నిడదవోలు రూరల్: అనుమానం పెనుభూతం అయ్యింది.. చివరికి కట్టుకున్న భార్యనే హతమార్చేలా ఉసుగొల్పింది.. ఓ భర్త తన భార్యను కత్తెరతో పొడిచి చంపిన సంఘటన నిడదవోలు మండలం శెట్టిపేటలో ఆదివారం కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. పెరవలి మండలం అన్నవరప్పాడుకు చెందిన నవ్య (31)కు తాపీమేస్త్రిగా పనిచేస్తున్న చిరంజీవి కుమార్‌కు పదకొండేళ్ల కిందట వివాహమైంది. శెట్టిపేటలో వీరు నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు. నవ్య తరచూ ఫోన్‌లో ఎవరితోనే మాట్లాడుతుందనే అనుమానంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. పెద్దల సమక్షంలో పలుమార్లు వీరికి నచ్చజెప్పి కాపురానికి పంపించేవారు. అదే గ్రామంలో కొద్దిరోజులుగా వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. ఆదివారం తెల్లవారుజామున భార్యాభర్తలు మళ్లీ గొడవపడ్డారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న కత్తెరతో ఆమెను బలంగా పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి తండ్రి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని నిడదవోలు సీఐ జానకీరామయ్య పరిశీలించి హత్యకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకున్నారు. నిందితుడు చిరంజీవి కుమార్ పోలీసుల అదుపులో ఉన్నాడు. అమ్మ చనిపోవడంతో ముగ్గురు కుమార్తులు గుండెలవిసేలా రోదించడం పలువురిని కంటతడి పెట్టించింది.

ఉత్సాహంగా జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు


జిల్లా స్థాయి జూనియర్స్ తైక్వాండో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆత్మరక్షణకు తైక్వాండో వంటి క్రీడలు అవసరమని జిల్లా ఒలింపిక్ సంఘ కార్యదర్శి డాక్టర్ జి.ఎలీషాబాబు అన్నారు. ఆదివారం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను ఒలింపిక్ సంఘ చీఫ్ ప్యాట్రన్ కర్రి భామిరెడ్డి, సంఘ కార్యదర్శి ఎలీషాబాబు ప్రారంభించారు. భామిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తైక్వాండో క్రీడకు మంచి ఆదరణ ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సహించాలని కోరారు. ఎలీషాబాబు మాట్లాడుతూ క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ 34 ఏళ్లుగా జిల్లాలో టోర్నమెంట్లు నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో సబ్ జూనియర్స్, జూనియర్స్ విభాగంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు సుమారు 350 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. సబ్‌జూనియర్స్ విభాగంలో 11 వెయిట్ కేటగిరీలు, జూనియర్స్ విభాగంలో 10 వెయిట్ కేటగిరీల్లో పోటీలు నిర్వహించి, రాష్ట్రస్థాయికి 11 మంది బాలురు, 11 బాలికలు సబ్ జూనియర్స్‌లో, 10 మంది బాలురు, 10 మంది బాలికలను జూనియర్స్‌లో ఎంపిక చేస్తామన్నారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ విజేతలకు మెడల్స్ అందజేశారు.

ప్రశాంతంగా కో ఆపరేటివ్ బ్యాంక్ ఓట్ల లెక్కింపు


విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న చల్లా శంకరరావు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా ముగిసిందని ఎన్నికల అధికారి కృష్ణకాంత్ ఆదివారం ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 బ్రాంచ్‌లలో 74,585 మంది ఓటర్లు ఉండగా, శనివారం రాజమహేంద్రవరం శ్రీకందుకూరి వీరేశలింగం విద్యాసంస్థల్లో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పోలైన ఓట్లలో 14,938 చెల్లుబాటు కాగా, 1944 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. ఆదివారం స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను అధికారులతో కలసి కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. రాత్రి వరకూ ఓట్ల లెక్కింపు సాగగా చివరకు డైరెక్టర్లుగా చల్లా శంకరరావు, కప్పల సూర్యప్రకాశరావు, పడాల శ్రీనివాసరావు, పిల్లి శ్యామ్‌కుమార్, యర్రమోతు ధర్మరాజు, బుడ్డిగ రవి కొండలరావు, యాళ్ల వెంకటరావు, పోలాకి పరమేశ్వరరావు, ముదిగి శ్రీనివాసరావు, యెనుముల రంగారావు విజయం సాధించారని కృష్ణకాంత్ ప్రకటించారు. మొత్తం 11 మంది డైరెక్టర్లకు గానూ ఒక డైరెక్టర్ పదవికి సింగం వెంకట రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన 10 డైరెక్టర్ల పదవికి 31 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ఇందులో చల్లా శంకరరావు ప్యానల్ విజయం సాధించడంతో నగరంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. త్వరలో సమావేశమై చైర్మన్‌గా చల్లా శంకరరావును డైరెక్టర్లు ఎన్నుకోనున్నారు. కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నిడదవోలు: స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం రాజమహేంద్రవరం నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళ్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్ నుంచి రెండో ప్లాట్‌ఫామ్‌కు వెళ్లేందుకు పట్టాలు దాటుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. సుమారు 45 ఏళ్ల వయసు కలిగి గళ్ల చొక్కా, లుంగీ ధరించి ఉన్నాడు. తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై శ్రీహరిబాబు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వీఎన్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఈదల


ఈదల శ్రీనివాస్ చౌదరి

ఆలమూరు: రాష్ట్ర వెటర్నరీ నాన్ గ్రాడ్యుయేట్ ఫెడరేషన్ (వీఎన్‌జీఎఫ్) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ ఈదల శ్రీనివాస్‌చౌదరి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాకినాడలో ఆదివారం రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వీఎన్‌జీఎఫ్ సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఆలమూరు మండలం పినపళ్ల పశువైద్యాధికారిగా పనిచేస్తున్న శ్రీనివాస్ చౌదరిని మరోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కేవీ రామరాజు, రుక్మతరావు, అప్పన్నబాబు, సహాయ అధ్యక్షుడిగా ఎస్.వీర్రాజు, కార్యదర్శిగా సాంబమూర్తి, కోశాధికారిగా ఎం.రామారావు, సంయుక్త కార్యదర్శులుగా ఆర్.శ్రీనివాస్, జీవీవీ సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫెడరేషన్ చరిత్రలో రెండో పర్యాయం ఏకగ్రీవంగా ఎన్నికైన డాక్టర్ శ్రీనివాస్ చౌదరిని వివిధ జిల్లాల నుంచి వచ్చిన యూనియన్ నాయకులు పూలమాలలతో సత్కరించారు.

ఆషాఢం ఎఫెక్ట్

- ఒడిదొడుకుల్లో జీడిపప్పు పరిశ్రమ
- మందగించిన కొనుగోళ్లు
- బస్తా గింజల ధర రూ.12,500
- కిలో పప్పు రూ.700


జీడి గింజలను మెషీన్లపై కట్ చేస్తున్న కార్మికులు


దేవరపల్లి పరిశ్రమలో తయారైన జీడిపప్పు

దేవరపల్లి: జీడిపప్పు పరిశ్రమలు ఒడిదొడుకులను ఎదుర్కొంటున్నాయి. మొన్నటి వరకూ పప్పు ధర గరిష్ఠస్థాయికి చేరడంతో వ్యాపారం గాడిలో పడిందనుకుంటున్న తరుణంలో ఆషాఢం ఎఫెక్ట్ ముంచేస్తోంది. స్వదేశీ గింజలు అందుబాటులో లేకపోయినా విదేశీ గింజలను కొనుగోలు చేసి వ్యాపారులు నిల్వ చేశారు. అయితే ఆషాఢ మాసం కావడంతో తయారైన పప్పు కొనుగోళ్లు మందగించాయి. ఏడాదిలో పది నెలల వ్యాపారం ఒడిదొడుకుల్లోనే సాగుతుందని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. మే, జూన్ నెలల్లో పప్పు ధర ఆశాజనకంగా ఉంది. కిలో రూ. 800 పలికింది. ఈ ధర కొద్దిరోజులు మాత్రమే నడిచింది. జూలైలో మళ్లీ రూ. 700కు తగ్గింది. ధర బాగున్నా పప్పు అమ్మకాలు మందగించాయని వ్యాపారులు వాపోతున్నారు.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లోని మెట్ట ప్రాంతాల్లో జీడిపప్పు పరిశ్రమలు విస్తరించి ఉన్నాయి. ప్రధానంగా వాణిజ్య పంటగా జీడిమామిడి తోటలను వేస్తున్నారు. ఇక్కడ పండిన గింజలతో పాటు విదేశీ గింజలను కొనుగోలు చేసి పరిశ్రమల్లో జీడిపప్పును తయారు చేస్తున్నారు. తయారైన జీడిపప్పును గుండు, బద్ద, కె.ముక్క (సంగం), ముక్కగా పట్టణ ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. జిల్లాలో నిడదవోలు మండలం తాడిమళ్లలో ఎక్కువగా పరిశ్రమలు ఉన్నాయి. తాడిమళ్ల, దేవరపల్లి, బందపురం, గొల్లగూడెం, నల్లజర్ల మండలం దూబచర్ల, ఘంటావారిగూడెం, గోపాలపురం ప్రాంతాల్లో సుమారు 100 వరకూ చిన్న, పెద్ద పరిశ్రమలు నెలకొల్పారు. ఇక్కడ రోజూ 40 నుంచి 50 టన్నుల జీడిపప్పు తయారవుతుంది. వీటిని హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, కనిగిరి, బందరు, వరంగల్, ఒంగోలు, చీరాల, కర్ణాటక తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. పరిశ్రమల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 60 వేల మంది మహిళలు, పురుషులు ఉపాధి పొందుతున్నారు. శ్రీకాకుళం జిల్లా పలాస తర్వాత జీడిపప్పు తయారీలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గుర్తింపు పొందింది.

పెరిగిన గింజల ధర

జీడిగింజల ధర అనూహ్యంగా పెరిగింది. ఈ ఏడాది గింజల దిగుబడి 30 శాతానికి పడిపోవడంతో కొరత ఏర్పడింది. అవసరానికి సరిపడా గింజలు లేక డిమాండ్ వచ్చింది. గత ఏడాది మే, జూన్, జూలై నెలల్లో బస్తా గింజల ధర రూ. 10,500 ఉండగా, ఈ ఏడాది మే, జూన్ నెలల్లో రూ. 14 వేలు పలికింది. ప్రస్తుతం రూ. 12,500 ధర పలుకుతోంది. స్వదేశీ గింజలు నాణ్యత ఉండడం లేదని వ్యాపారులు అంటున్నారు. గింజలు బాగుంటే బస్తాకు 24 కిలోల పప్పు దిగుబడి వస్తుందని, ప్రస్తుతం గింజలు 23 కిలోల పప్పు వస్తుందని చెబుతున్నారు. ఆషాఢంలో శుభకార్యాలు లేకపోవడం, మూఢం మూడు నెలలు ఉండడంతో జీడిపప్పుకు డిమాండ్ తగ్గింది. నెల రోజుల నుంచి అమ్మకాలు లేవు. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో పప్పు కిలో రూ. 510 ఉండగా, అంచెలంచెలుగా పెరుగుతూ జూన్ నెలలో రూ. 800 పలికింది. వ్యాపారాలు లేకుండా మార్కెట్ ఇదే విధంగా ఉంటే పరిశ్రమలను మూసివేసే పరిస్థితి ఉంటుందని వ్యాపారులు అంటున్నారు. ఇప్పటికే చాలా పరిశ్రమలు మూతబడ్డాయని వాపోతున్నారు. ఆశలన్నీ శ్రావణ మాసంపైనే పెట్టుకున్నామని చెబుతున్నారు.

మందగించిన కొనుగోళ్లు



జీడిపప్పు కొనుగోళ్లు మందగించాయి. నెల రోజుల నుంచి ఇదే పరిస్థితి. తయారైన పప్పు నిల్వలు పేరుకుపోయాయి. ఒక్కో పరిశ్రమ వద్ద రెండు నుంచి మూడు టన్నుల పప్పు నిల్వలు ఉన్నాయి. ఎక్కువ రోజులు నిల్వ ఉంటే నాణ్యత దెబ్బతింటుంది. ఈ ఏడాది స్వదేశీ గింజల కొరత ఎక్కువగా ఉంది. నష్టాలను భరించలేక చిన్న పరిశ్రమలను మూసివేశారు. మరో వారంలో మరిన్ని పరిశ్రమలు మూతబడతాయి.

– సుతాపల్లి వెంకన్నబాబు, అధ్యక్షుడు, శ్రీవేంకటేశ్వర క్యాజూ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, దేవరపల్లి